# అధ్వానంగా కాలువలు.. ఆందోళనలో రైతులు

- ఆక్రమణకు గురవుతున్న చిన్న కాలువలు
- తూడు, గుర్రపుడెక్క, ప్లాస్టిక్ వ్యర్థాలతో పూడుకుపోయిన కాలువలు
- శివారు భూములకు అందని సాగునీరు
- రైతులు, కౌలుదారుల ఆందోళన

**పెరవలి:** సాగునీటి పారుదల వ్యవస్థలో కీలమైన కాలువలు పూడుకుపోయి అస్తవ్యస్తంగా ఉన్నాయి. కాలువలకు నీరు వదిలిరోజులు గడుస్తున్నా ఇంకా ప్రధాన కాలువలకు నీరు రాకపోగా వీటి నుంచి విడిపోయే చిన్న, మధ్యస్త కాలువలకు సాగునీరు ఎప్పుడు అందుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రధాన కాలువల అభివృద్ధిపై చూపించే శ్రద్ధ మధ్యస్త, చిన్న కాలువలపై చూపించకపోవటంతో అవి నిర్లక్ష్యానికి గురై పూడుకుపోయి అధ్వానంగా ఉన్నాయి. దీని పర్యవసానంగా కాలువ గట్లు ఆక్రమణలకు గురై కుచించుకుపోవడంతో పాటు వ్యర్థాలు, గుర్రపుడెక్క పేరుకుపోయి సాగునీరు సక్రమంగా ప్రవహించే పరిస్థితి లేకుండాపోయింది. సక్రమంగా సాగునీరు అందక ఆయా ఆయకట్టు రైతులు ఏటా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రధాన కాలువల్లో సాగునీరు సక్రమంగా వస్తున్నా పంటభూములకు నీరు అందని పరిస్థితి నెలకొంది.


ముక్కామలలో చెత్తాచెదారంతో నిండిన పంట కాలువ


పూడుకుపోయిన ఖండవల్లి ఛానల్


అన్నవరప్పాడులో అస్తవ్యస్తంగా పేకేరు కాలువ


పెరవలిలో వ్యర్థాలు, గుర్రపుడెక్కతో నిండిన కాపవరం కాలువ


తుప్పలు పెరిగి పూడుకుపోయిన వేమవరం కాలువ

**రబీ సాగుకు అందని సాగు నీరు**

పెరవలి మండలంలో ప్రధాన కాలువలైన నరసాపురం కాలువ, కాకరపర్రు కెనాల్, బ్యాంక్ కెనాల్ నుంచి విడిపోయిన చిన్న, పిల్ల కాలువలు 69 ఉన్నాయి. చిన్న, పిల్ల కాలువల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్క, తూడు వలన దిగువ భూములకు నీరు అందేలా కనిపించడం లేదు. ప్రతి చిన్న కాలువలో తూడు, గుర్రపుడెక్క, వ్యర్థాలతో పూడుకుపోయి శివారు భూముల రైతులకు సాగునీరు అందడం లేదు. ఆక్రమణలు అధిగమవడంతో కాలువలు కుచించుకుపోయాయి. పెరవలి, ముక్కామల, ఖండవల్లి, ఉసులుమర్రు, కాపవరం, అన్నవరప్పాడు గ్రామాల మధ్య నుంచి వెళ్లే గరప కాలువ, వైర్ కాలువ, కాపవరం కాలువ, ఖండవల్లి చానల్, బ్యాంచ్ కెనాల్, పెండ్యాల పంపింగ్ స్కీమ్ కాలువలున్నాయి. ఈ కాలువల ఆధారంగా ఒక్క పెరవలి మండలంలోనే 39,000 ఎకరాలకుపైగా సాగునీరు అందించాల్సి ఉంది. ప్రస్తుతం కేవలం 20,000 ఎకరాలకు మాత్రమే సక్రమంగా నీరు అందుతుండగా మిగిలిన 19వేల ఎకరాలకు ఖరీఫ్‌లో అరకొరగా సాగునీరందుతోంది. రబీ సాగుకు కాలువల ద్వారా నీరు అందక బోర్లపై ఆధారపడాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు.

**డంపింగ్ యార్డుల్లా పంట కాలువలు**

కాపవరం, ముక్కామలలోని భూములకు కాలువల ద్వారా చుక్కనీరు రాక బోర్లపైనే సాగు చేసుకోవాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. అధికారులు పట్టించుకోకపోయినా సాగునీటి కోసం కాలువలను తామే ఒక్కోసారి బాగు చేసుకుంటున్నామని, అయినా ఖరీఫ్ పంటకే తప్ప రబీ పంటకు నీరు అందడం లేదని వారంటున్నారు. ఏటా ఈ కాలువల ద్వారా సాగునీరు అందకపోయినా నీటి తీరువా కడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ అధికారులు చిన్న కాలువల అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోవడం లేదని రైతులు, కౌలుదారులు ఆరోపిస్తున్నారు. గ్రామాల మధ్య నుంచి ఉన్న చిన్న కాలువల్లో గృహవాసులు ఎక్కడిక్కడ డంపింగ్ యార్డులా చెత్తా చెదారం వేయటం వల్ల వ్యర్థాలతో అవి పూడుకుపోతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. కాపవరం వరకూ ఉండే గరప కాలువ పెరవలి మధ్య నుంచి రావడంతో గృహవాసులతోపాటు, భోజన హోటళ్లు, చికెన్, చేపల దుకాణాల నుంచి వచ్చే వ్యర్థాలను వేస్తున్నారు. దీంతో గరప కాలువ పూడుకుపోయి సాగునీరు అందటం లేదని రైతులు వాపోతున్నారు.

### సాగుకు నీరు అందడం లేదు



కాలువలను రైతులే స్వచ్ఛందంగా బాగు చేసుకుంటున్నారు. అధికారులు పట్టించుకోరు, ఎన్నిసార్లు విన్నవించినా సమాధానం చెప్పరు. ఈ కాలువలపై రబీలో సాగునీరు రావటం ఎంతో కష్టం. చిన్న కాలువలు ఆక్రమణకు గురైనా పట్టించుకునే నాథుడు కరువయ్యారు.

– కుసుమే సూరిబాబు, రైతు, ఖండవల్లి

### బోర్లపై పంటల సాగు



చిన్న, పిల్ల కాలువల పరిస్థితి అధ్వానంగా ఉంది, కాలువల్లో వ్యర్థాలతో పాటు, చెత్తాచెదారం, గుర్రపుడెక్క పేరుకుపోవడంతో సాగునీరు అందటంలేదు, అధికారులు, ప్రజాప్రతినిధులకు చెప్పినా ఉపయోగం లేదు. బోర్లపై పంటలు సాగు చేసుకుంటున్నాం.

– కోటిపల్లి రాంబాబు, రైతు, అన్నవరప్పాడు

### గరప కాలువలో తవ్వకాలు చేపట్టాం



మండలంలో పేకేరు కాలువ, గరప కాలువలో పూడిక తవ్వకాలకు నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతానికి గరప కాలువలో పూడిక తవ్వకాలు చేపట్టాం. పేకేరు కాలువ తవ్వకాలు త్వరలో చేపట్టి పూర్తి చేస్తాం.

– ఎస్.బాలమురళీ కృష్ణ, ఇరిగేషన్ ఏఈ, పెరవలి

# ఉక్కిరిబిక్కిరి

- నిప్పులు చెరిగిన భానుడు
- వడగాడ్పులకు అల్లాడుతున్న జనం
- నిర్మానుష్యంగా మారిన రహదారులు

**పెరవలి:** భానుడి భగభగలకు వడగాడ్పులు తోడవ్వడంతో రహదారులు నిర్మానుష్యంగా మారాయి. రెండు రోజులుగా సూర్యుడు నిప్పుల వర్షం కురిపించటంతో ప్రజలు విలవిల్లాడుతున్నారు. రేయింబవళ్ల తేడా లేకుండా ఉక్కపోతతో అల్లాడుతున్నారు. పెరవలి మండలంలో శుక్రవారం 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవ్వటంతో ప్రజలు బెంబేలెత్తారు. జ్యూస్‌లు, శీతలపానీయాలతో సేద తీరడం కనిపించింది. ఉదయం 8 కల్లా వడగాడ్పులు వీయడంతో వ్యాపార సంస్థలూ మూతపడ్డాయి. ఉక్కపోత భరించలేక చిన్న పిల్లలు, వృద్ధులు తల్లడిల్లిపోయారు. ఇంట్లో ఉండలేక జనం చెట్ల కింద సేద తీరడం కనిపించింది. రాత్రిళ్లు ఉక్కపోతతో నిద్రపట్టక విలవిల్లాడుతున్నారు. మరోవైపు విద్యుత్ కోతలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హైఓల్టేజీ, లోఓల్టేజీలతో ఫ్యాన్లు కాలిపోవటం, ఏసీలు పనిచేయకపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏ వస్తువు పట్టుకున్నా వేడిగా ఉంటున్నాయి. నిత్యం రద్దీగా ఉండే జాతీయ రహదారిపై భానుడి ప్రతాపానికి వాహనాలను ఎక్కడికక్కడ నిలుపుదల చేయటంతో రోడ్లు నిర్మానుష్యంగా మారాయి.


ఖండవల్లి వద్ద నిర్మానుష్యంగా ఉన్న జాతీయ రహదారి


నల్లాకులవారిపాలెం వద్ద నిర్మానుష్యంగా రహదారి

**వడగాడ్పులతో బెంబేలు**

**దేవరపల్లి:** రోహిణీ కార్తె ప్రభావంతో శుక్రవారం భానుడు నిప్పులు చెరిగాడు. ఉదయం 8 నుంచి సాయంత్రం వరకూ ఎండతీవ్రతతో పాటు, వడగాడ్పులు వీయడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఉపాధి పనులకు వెళ్లిన కూలీలు వడగాడ్పుల దెబ్బకు అల్లాడిపోయారు. వృద్ధులు, చిన్నారులు ఇళ్లకే పరిమితమయ్యారు. ఏసీలు, కూలర్లతో ఇళ్లలో సేద తీరారు. వ్యాపార దుకాణాలను మధ్యాహ్నం సమయంలో మూసివేశారు. మెట్ట ప్రాంతంలో శుక్రవారం 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఏప్రిల్, మే నెలల్లో కాస్త వర్షాలు కురవడంతో వాతావరణం చల్లబడింది. దీంతో ఈ ఏడాది వడగాడ్పుల ప్రభావం ఉండదని ప్రజలు తొలుత భావించారు. ప్రస్తుతం వడగాడ్పులను తట్టుకోలేని పరిస్థితి ఏర్పడింది. శీతల పానీయాలు, జ్యూస్‌లకు డిమాండ్ ఏర్పడింది. ఈ ఎండలు మరో రెండు వారాలు ఉంటాయని అంటున్నారు. రాత్రి సమయంలోనూ వేడిగాలులకు సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

## లేఅవుట్ సర్వే అనంతరం ఇళ్ల స్థలాలు కేటాయిస్తాం

**ఉండ్రాజవరం:** పాలంగి లే అవుట్‌లో ఇళ్ల స్థలాల ప్లాట్లను సర్వేయర్ల ద్వారా విభజించి, వారం రోజుల్లో లబ్ధిదారులకు అప్పగిస్తామని తహసీల్దార్ పీఎన్‌డీ. ప్రసాద్ హామీ ఇచ్చారు. మండలంలో పాలంగిలో మండల ప్రత్యేక అధికారి ఎం.సందీప్ అధ్యక్షతన లే అవుట్ లబ్ధిదారులతో మండల అధికారులు శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో లబ్ధిదారులు మాట్లాడుతూ తమకు గతంలో మంజూరు చేసిన ఇళ్ల స్థల పట్టాలకు సంబంధించిన ప్లాట్లను అప్పగిస్తే, ఇళ్లను నిర్మించుకుంటామన్నారు. తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ మాట్లాడుతూ పాలంగి గ్రామానికి చెందిన దోడ్డా సూర్యనారాయణ తండ్రి సత్యం అనే వ్యక్తి తమకు గత ప్రభుత్వంలో జగనన్న కాలనీలో మంజూరైన ఇళ్ల స్థల పట్టాలకు సంబంధించిన ప్లాట్లు అప్పగించాలని పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు అందించిన ఫిర్యాదుపై సమావేశమైనట్టు తెలిపారు. హౌసింగ్ ఏఈ బి.ఏడుకొండలు మాట్లాడుతూ లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలకు అనుమతుల మంజూరుపై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వి.రామారావు, ఈవోపీఆర్డీ అంజనేయ శర్మ, సర్పంచ్ బొక్క శ్రీనివాసు, కార్యదర్శి ఎండీ హసన్ జానీ పాల్గొన్నారు.


పాలంగిలో లేఅవుట్ లబ్ధిదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్

## యోగా సాధనతో ఒత్తిడి దూరం


కొవ్వూరులో యోగా సాధన చేస్తున్న మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, ఇతర అధికారులు

**తాళ్లపూడి(కొవ్వూరు):** ప్రతి రోజు యోగా సాధన చేయడం ద్వారా ఒత్తిడి నుంచి బయట పడవచ్చునని మున్సిపల్ కమిషనర్ టి నాగేంద్రకుమార్ అన్నారు. కొవ్వూరులోని ఆంధ్రా గీర్వాణ విద్యాపీఠం వద్ద శుక్రవారం విద్యాశాఖ ఆధ్వర్యంలో యోగాంధ్ర 2025 కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు వివిధ యోగసనాలు వేసారు. మాస్టర్ ట్రైనీ పెనుమత్స సరోజిని యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్, తహసీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, ఎంఈవో రామకిషోర్, ఉపాధ్యాయులు, వార్డు సెక్రటరీలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## మసీదుల వద్ద నేడు ప్రత్యేక నిఘా

**కంబాలచెరువు (రాజమహేంద్రవరం):** జిల్లాలోని ముస్లింలకు ఎస్పీ డి.నరసింహకిశోర్ బక్రీద్ పండగ శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రధాన మసీదులు, ఈద్గాల వద్ద కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు, సోలార్ కెమెరాలు, డ్రోన్లతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ప్రశాంత వాతావరణంలో ముస్లింలు పండగ జరుపుకోవాలన్నారు.

## పీ 4 సర్వే నోడల్ అధికారుల నియామకం

**దేవరపల్లి:** దిగువ మధ్య తరగతి కుటుంబాలను గుర్తించేందుకు ప్రభుత్వం చేపట్టిన పీ 4 సర్వే పర్యవేక్షణ, సమర్థవంతంగా అమలు చేయడానికి పేద కుటుంబాలను గుర్తించడానికి గ్రామ పంచాయతీ స్థాయిలో నోడల్ అధికారులుగా, మండలస్థాయి అధికారులను గ్రామ పంచాయతీ పీ 4 సర్వే నోడల్ అధికారులుగా నియమించినట్టు ఎంపీడీఓ ఎస్. వేణుగోపాల రెడ్డి తెలిపారు. బందపురం పంచాయతీకి ఎస్. వేణుగోపాలరెడ్డి (ఎంపీడీఓ), చిన్నాయగూడెం పంచాయతీకి ఎం.తిరుమలదాస్ (ఎంఈఓ), దేవరపల్లి పంచాయతీకి ఎం. శ్రీనివాస్ (తహసీల్దార్), ధుమంతునిగూడెం పంచాయతీకి ఆర్. శివ (ఏఈ హౌసింగ్), దుద్దుకూరు పంచాయతీకి డీఆర్ఎస్ కుమారి (ఆర్‌డబ్ల్యూఎస్), గౌరీపట్నరం పంచాయతీకి వి.శశికళ(ఐసీడీఎస్ సూపర్‌వైజర్), కురుకూరు పంచాయతీకి టి. సంజన (ఏఈఓ వ్యవసాయ శాఖ), కృష్ణంపాలెం పంచాయతీకి జీవీ శ్రీనివాసరావు (ఏపీఓ ఎన్ఆర్‌జీఎస్), లక్ష్మీపురం పంచాయతీకి ఎ.సత్యనారాయణ (సీఎస్ డీటీ), పల్లంట్ల పంచాయతీకి ఎస్‌కే షాజహాన్ (ఏఈ పీఆర్), రామన్నపాలెం పంచాయతీకి ఎం. విజయలక్ష్మి (ఐసీడీఎస్ సూపర్‌వైజర్), సంగాయగూడెం పంచాయతీకి కె. విజయ్ (ఎంఏఓ వ్యవసాయ శాఖ), త్యాజంపూడి పంచాయతీకి ఆర్‌వీ శ్రీనివాస్ (ఎస్‌డబ్ల్యూఓ), యాదవోలుకు కె. విజయశాంతి (ఐసీడీఎస్ సూపర్‌వైజర్), యర్నగూడెం పంచాయతీకి వై. రాజారావు (ఈఓపీఆర్డీ)ను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్టు ఆయన తెలిపారు. నోడల్ అధికారులకు శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి ఎస్.సత్యనారాయణ, ఎంపీడీఓ వేణుగోపాలరెడ్డి సమావేశం నిర్వహించారు.

## ఎండీఎం కార్మికులకు శిక్షణ

**తాళ్లపూడి(కొవ్వూరు):** కొవ్వూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద శనివారం మండలంలోని 53 ప్రభుత్వ పాఠశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం వంట కార్మికులకు శిక్షణ కార్యక్రమం, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ డి.రామకృష్ణ, ఇతర అధికారులు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం రుచిగా అందించాలని తెలిపారు. వంట కార్మికులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను, ఆహారం సిద్ధం చేసే ప్రదేశంలో పరిశుభ్రత ప్రాధాన్యతను వివరించారు. వంట చేసేటప్పుడు గ్యాస్ సిలెండర్ల వద్ద అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో బీబీ ఎస్ స్వరూప్, ఎంఈవో 2 కె రామకిషోర్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రజియా, ఫైర్ స్టేషన్ సిబ్బంది కేవీ జయరత్నం, సీహెచ్ఓ బీవీ లక్ష్మి, సీఆర్‌పీ డి.సతీష్, వంట కార్మికులు పాల్గొన్నారు.


కొవ్వూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ఎండీఎం కార్మికులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

## అన్న క్యాంటీన్లలో ఆహార పదార్థాల నాణ్యత తనిఖీ

**తాళ్లపూడి(కొవ్వూరు):** అన్న క్యాంటీన్లలో అందజేసే ఆహార పదార్థాల నాణ్యత, సమయపాలనపై ఫిర్యాదులు వస్తున్నాయని ప్రజలకు అందించే పౌర సేవలు విషయంలో జవాబుదారీతనంతో ఉండాలని కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు. కొవ్వూరు పట్టణంలోని అన్న క్యాంటీన్‌ను శుక్రవారం ఆర్డీవో ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల భూములకు భద్రత కల్పించడానికి చర్యలు తీసుకుంటుందన్నారు. అన్న క్యాంటీన్లలో అందజేసే ఆహార పదార్థాల నాణ్యత, సమయపాలన, తదితర అంశాలపై ప్రజల నుంచి ఫిర్యాదులు నమోదవుతున్నట్టు ఆమె తెలిపారు. ఇదే విషయంపై ఆకస్మిక తనిఖీల ద్వారా ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్నట్టు ఆర్డీవో తెలిపారు. ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజలు ఫిర్యాదు చెయవచ్చని, ఇందుకోసం క్యూ ఆర్ కోడ్‌ను బహిరంగంగా ప్రదర్శిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆహార నాణ్యతను తనిఖీ చేసి, ప్రజల అభిప్రాయాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ టి నాగేంద్ర కుమార్, తహసీల్దార్ ఎం దుర్గాప్రసాద్ తదితరులున్నారు.

## గ్రంథాలయాల్లో ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరాలు


తాళ్లపూడి శాఖా గ్రంథాలయంలో అందించిన బహుమతులతో విద్యార్థులు

**తాళ్లపూడి:** పుస్తక పఠనం ఉత్తమ వ్యక్తిత్వాన్ని, విజ్ఞానాన్ని అందిస్తుందని పశు వైద్యాధికారి ఎస్ బాలాజీ తెలిపారు. తాళ్లపూడి శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారితోపాటు శ్రీ విజేత హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ జేవీ ప్రమోద్‌కుమార్ పాల్గొని విద్యార్థులకు బహుమతులు అందజేసారు. గ్రంథాలయ అధికారి నరేష్ మాట్లాడుతూ గ్రంథాలయం వాటి ప్రాముఖ్యత విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రతిభచూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.


విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న గ్రంథాలయ అధికారి గద్దె శ్రీనివాసరావు విద్యార్థులకు ప్రశంస

**నిడదవోలు:** వేసవి శిక్షణ తరగతులు ముగింపు కార్యక్రమాన్ని నిడదవోలు శాఖా గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కుందుల ప్రభాకరం, యోగా గురువు సానివు సుబ్బారావు, గ్రంథాలయ అధికారి గద్దె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**వేసవి శిక్షణ తరగతులతో విజ్ఞాన వికాసం**


ఉండ్రాజవరం శాఖ గ్రంథాలయంలో అందించిన ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

**ఉండ్రాజవరం:** విద్యార్థుల విజ్ఞాన వికాసానికి, వారిలో ఏకాగ్రత పెరగడానికి గ్రంథాలయాల్లో నిర్వహించే వేసవి శిక్షణ తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయని మోర్త ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు చెరుకూరి వెంకటకృష్ణప్రసాద్ అన్నారు. ఉండ్రాజవరం శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల ముగింపు సభ గ్రంథాలయాభివృద్ధి కమిటీ సభ్యుడు ఆకెళ్ల శ్రీనివాసరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, పుస్తకాలు, పెన్నులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకుడు గుత్తికొండ కృష్ణారావు, మద్దిపాటి రామచంద్ర రావు, పాఠకులు ఎంవీ కృష్ణారావు, సింహాద్రి శ్రీరామ చంద్ర మూర్తి పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### గృహ నిర్మాణాలపై సమీక్ష


తాళ్లపూడి మండల పరిషత్ కార్యాలయంలో గృహ నిర్మాణాలపై సమీక్షిస్తున్న అధికారులు

**తాళ్లపూడి:** నిర్మాణంలో ఉన్న గృహలు వేగంగా నిర్మాణాలు చేపట్టాలని స్పెషల్ ఆఫీసర్ (డీఎల్‌పీవో) వై అమ్మాజీ అన్నారు. తాళ్లపూడి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల స్పెషల్ ఆఫీసర్ (డీఎల్‌పీవో) వై అమ్మాజీ అధ్యక్షతన గృహ నిర్మాణ శాఖ అధికారులు, లబ్ధిదారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వై అమ్మాజీ మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అర్హత ఉన్న లబ్ధిదారులకు డ్వాక్రా ద్వారా అదనపు రుణాలు మంజూరు చేస్తామని చెప్పారు. మండల ఏపీఎం మంగాయమ్మ రుణాలు పొందడానికి గల అవకాశాలను వివరించారు. హౌసింగ్ ఏఈ శ్రీనివాసు మాట్లాడుతూ మండలంలో గృహ నిర్మాణ లబ్ధిదారులు 218 మంది చేపట్టిన పనులు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీవో టీబీ వెంకటరమణ, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డ్వాక్రా యానిమేటర్స్ పాల్గొన్నారు.

### స్టేట్ ర్యాంకర్ శ్రీ వల్లికి సత్కారం


శ్రీవల్లిని సత్కరిస్తున్న జై భీమ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సభ్యులు

**నిడదవోలు:** పట్టణంలోని చర్చిపేటకు చెందిన పిట్టా శ్రీ వల్లి పారామెడికల్ కోర్సులో మొదటి సంవత్సరం పరీక్షల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించడంతో ఆమెను జై భీమ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. భవిష్యత్తులో శ్రీవల్లి ఉన్నత విద్య కోసం జై భీమ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సహకారం అందిస్తామని చెప్పారు. ప్రస్తుతం శ్రీవల్లి అమలాపురం కాలేజ్ ఆఫ్ పారా మెడికల్స్ (డాక్టర్ ఎన్‌టీఆర్ యూనివర్సిటీ అఫ్ హెల్త్ సైన్స్)లో విద్యను అభ్యసిస్తోంది. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి జువ్వల రాంబాబు, రాజు, బాబ్జి, సుధాకర్, నాగరాజు పాల్గొన్నారు.

### నేరాల అదుపులో నిఘా కోసం డ్రోన్ల వినియోగం


సీఐ విశ్వంకు డ్రోన్లు అందజేస్తున్న కొవ్వూరు జోన్ అపుస్మా నాయకులు

**తాళ్లపూడి(కొవ్వూరు):** నేరాల అదుపులో నిఘా కోసం ఆధునిక డ్రోన్ టెక్నాలజీ ఎంతగానో ఉపయోగపడుతుందని కొవ్వూరు టౌన్ సీఐ విశ్వం తెలిపారు. సామాజిక బాధ్యతలో భాగంగా అంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) కొవ్వూరు జోన్ ప్రతినిధులు కొవ్వూరు పోలీస్ సర్కిల్‌కు 2 డ్రోన్లు శుక్రవారం అందజేసారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ విశ్వం మాట్లాడుతూ పట్టణ, రూరల్ సర్కిల్ అభ్యర్థన మేరకు అతి తక్కువ సమయంలోనే డ్రోన్లు అందజేసిన అపుస్మా వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ డ్రోన్ల సాయంతో వీడియో చిత్రీకరణ ద్వారా పటిష్టమైన నిఘా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు జోన్ అపుస్మా అధ్యక్షుడు వీవీ అనీష్, జోన్ సెక్రటరీ పి.వెంకటరత్నం, అపుస్మా నాయకులు వి నెల్సనప్ ఆంటోనీ, ఎస్ సత్యనారాయణ, రవిచంద్ర, సుబ్బారావు పాల్గొన్నారు.

### వైభవంగా శ్రీవారి మాస కల్యాణం


దేవరపల్లిలో శ్రీవారి మాస కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

**దేవరపల్లి:** జ్యేష్ట శుద్ధ ఏకాదశి సందర్భంగా దేవరపల్లిలో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి వారి మాస కల్యాణోత్సవం శుక్రవారం రాత్రి ఆలయ వద్ద వైభవంగా నిర్వహించారు. అమ్మవార్లను పెండ్లి కుమార్తెలు గాను, స్వామి వారిని పెండ్లి కుమారుడిగా అలంకరణ చేసి భక్తుల గోవింద నామస్మరణతో అర్చకులు కల్యాణ వేదికపైకి తోడ్కొని వచ్చి వివాహ తంతు ప్రారంభించారు. రాత్రి 7.30 గంటల నుంచి 10 గంటల వరకు కల్యాణం నిర్వహించారు. ఆలయ అర్చకులు దుర్గాప్రసాద్(దత్తు) శ్రీవారి కల్యాణ వేడుకలను నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. యర్నగూడెంలో వేంచేసిన అలివేలు మంగ పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. విశేషంగా భక్తులు కార్యక్రమంలో పాల్గొని అభిషేకాన్ని తిలకించారు. అభిషేకం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

### వైభవంగా సోమేశ్వర స్వామి ఆలయ ప్రారంభోత్సవం


తాడిపర్రులో నూతన ఆలయం వద్ద మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు

**ఉండ్రాజవరం :** తాడిపర్రులో పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు యలమంచిలి కృష్ణమూర్తి శివాచార్య ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ ఎల్.ప్రసాద్ శర్మ, బాదంపూడి ప్రసాద్ సారథ్యంలో ఆలయ అర్చకులు మంచిలి సాయిరామ్ శర్మ పర్యవేక్షణలో ఈక్రతువును నిర్వహించారు. ఉదయం 7.49 గంటలకు సమస్త విగ్రహ యంత్ర ధ్వజ శిఖర ప్రతిష్ఠను కన్నుల పండువగా చేపట్టారు. స్వామి వారి తొలి దర్శనం, మహా పూర్ణాహుతి, ఆచార్య పూజ, అగ్ని ప్రదక్షిణ, శాంతి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. భక్తులు విచ్చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు పాల్గొని, పార్వతీ సమేత సోమేశ్వరస్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

**దేవరపల్లి:** మండలంలోని రామన్నపాలెం 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో 11 కేవీ రామన్నపాలెం రూరల్ ఫీడర్‌పై ఆర్డీఎస్ పనుల నిమిత్తం ఆదివారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ నిడదవోలు ఈఈ ఎస్.నారాయణ అప్పారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ధుమంతునిగూడెం, కొత్తగూడెం, సుబ్బరాయపురం గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు.